క్లుప్తంగా

మోషేన్ రాజు పరామర్శ



వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మోషేన్ రాజు తదితరులు

ద్వారకాతిరుమల : మండలంలోని రామసింగవరం పంచాయతీ కొత్తగూడెంకు చెందిన వ్యాపారవేత్త పెన్మెత్స నరసింహరాజు తల్లి వరలక్ష్మి ఈనెల 22న రాత్రి మృతి చెందారు. ఈ ఘటనను పురస్కరించుకుని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు శనివారం కొత్తగూడెంలోని ఆమె ఇంటికి వెళ్లి, ఆమె కుమారులు చక్రవర్తిరాజు, కొండరాజు, వెంకటపతిరాజు, నరసింహరాజు, రామకృష్ణరాజులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నేతలు మద్దిపాటి ప్రసాద్, ఐ.భీమవరానికి చెందిన ఆనందవర్మ ఉన్నారు.

ఆలయానికి గేటు బహూకరణ



దాతలను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయానికి దాత కంచర్ల బాలకృష్ణ, శైలజ దంపతులు రూ. 65వేలు విలువైన స్టీల్‌గేటును శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబసభ్యులను ఆలయ కమిటీ దుశ్శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మారిశెట్టి రాధాకృష్ణ, మాడా రామమోహన్‌రావు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించడమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి అన్నారు. మండలంలోని తిరుమలాపురం, కేతవరం, పంగిడిగూడెం, పేరంపేట సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అర్హులను గుర్తించి పథకాలను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఎంఎల్‌వో రాజా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రాయితీలను వినియోగించుకోండి

చింతలపూడి : ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ పిలుపునిచ్చారు. తిమ్మిరెడ్డిపల్లిలో శనివారం జరిగిన కార్యక్రమంలో రైతులకు కౌలు గుర్తింపు కార్డులు, కంది విత్తనాలు అందచేశారు. మండల వ్యవసాయాధికారి మీనా కుమారి, ఎంపీటీసీ సాగర్, సచివాలయ కన్వీనర్ గంగవల్లి సురేష్, రామిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక

లింగపాలెం : కలరాయునగూడెం పంచాయతీ యర్రావారిగూడెం గ్రామానికి చెందిన ఎంపీపీ పాఠశాల విద్యార్థి పాకనాటి కౌసిక్ నవోదయ పరీక్షల్లో అర్హత సాధించి పెదవేగిలో నవోదయ పాఠశాలలో సీటు సాధించినట్లు ఉపాధ్యాయులు ఎస్ నాగేశ్వరరావు ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణపరిధిలోని వివిధ నేరాలకు సంబంధించి పాత నేరస్తులను సస్పెక్ట్, కేడీ, డీసీ షీట్ ఉన్న పలువురు వ్యక్తులకు జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 40 మందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎటువంటి నేరాలకు పాల్పడవద్దని సూచించారు. నేర ప్రవృత్తిని విడనాడి, సమాజంలో గౌరవ ప్రదమైన జీవనం సాగించాలన్నారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు, ఐడీపార్టీ ఏఎస్సై ఎన్‌వీ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

కొయ్యలగూడెం : పోలవరం నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సీపీఎం ఇచ్చిన పిలుపుమేరకు పోలవరం పోరుకాక కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమం మెయిన్ సెంటర్లో శనివారం నిర్వహించారు.

రక్తహీనత లోపంపై దృష్టి పెట్టాలి

కామవరపుకోట : అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని రక్తహీనత లోపం ఉన్న స్త్రీలు, పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీరకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా సంరక్షణ కార్యదర్శులకు, అంగన్‌వాడీ టీచర్లకు సీఆర్ యాప్ కన్సిస్టెంట్ రిథమ్స్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్‌లో జగనన్న సురక్ష పథకం గురించి, జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభించే టేక్ హోమ్ రేషన్ అందించే సరుకులు గురించి అవగాహన కల్పించారు. రక్తహీనత లోపం ఉన్న తల్లులకు, ఎత్తు, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్యకర్తలకు సూచించారు. సీడీపీవో బ్యూల, సూపర్‌వైజర్లు మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష

- జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ





బుట్టాయగూడెం : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
చింతలపూడి : నామవరం సచివాలయంలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : అర్హులకు మేలు చేకూర్చేందుకు «జగనన్న సురక్ష» కార్యక్రమం వేదికగా మారాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద జగనన్న సురక్ష పథకం అమలుపై పోలవరం నియోజకవర్గం స్థాయిలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అన్ని శాఖల అధికారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏవైనా కారణాల వల్ల అర్హులకు సంక్షేమ పథకాలు అందనట్లయితే వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 1 వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజల వద్ద వెళ్లి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రకాల వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన వినతులు, అవసరమైన పత్రాలను సేకరించాలని చెప్పారు. గ్రామాల్లో పర్యటించేందుకు రూపొందించుకున్న షెడ్యూల్ ప్రకారం ఏ రోజు ఏ సచివాలయ పరిధిలో సభలు నిర్వహిస్తారో ముందుగా సమాచారాన్ని ప్రజలకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగుతూ జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో జీవీవీ సత్యనారాయణ, ఏపీ ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ గంజిమాల దేవి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఈఈ రమాదేవి, ఏడు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్ శాఖతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీచైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం

బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏకి మొదటిసారిగా వచ్చిన ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకు స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓ సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు.

సర్వే ప్రారంభించిన సచివాలయ సిబ్బంది

కామవరపుకోట : జగనన్న సురక్ష పథకంలో భాగంగా శనివారం మండలంలో గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకుని సర్వే నిర్వహించారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందనివారు ఉంటే వెంటనే తెలియజేయాలని, సత్వరమే అందేలా కృషి చేస్తామని అన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని సీతానగరం, నామవరం, యర్రగుంటపల్లి గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్న లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ ఫలాలు అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు గాయం మల్లేశ్వరి, తుల్లిమిల్లి రాణి, వైస్ ఎంపీపీ ఎస్ వరలక్ష్మి, ఎంపీటీసీ కె రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మోహన్‌బాబు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో పూజలు



జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభించి నిత్య ఆరాధన, మంగళశాసనం, అనంతరం భక్తులకు సర్వదర్శనము, హారతి, అష్టోత్తరం, మొదలగు పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా అగ్ని ప్రతిష్ఠాపన

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విశ్వశాంతి, గోసంరక్షణార్థం నిర్వహిస్తున్న లక్ష పిడకల యజ్ఞంలో భాగంగా శనివారం పలు కార్యక్రమాలు జరిగాయి. ముందుగా గో ఉపాసక శ్రీ సురభిదాస్ బ్రహ్మశ్రీ కందుర్తి మహీకిరణ్ శర్మ యజ్ఞ ప్రాంతాన్ని శుద్ధి చేసి, అగ్ని ప్రతిష్ఠాపన ద్వారా యాగాన్ని ప్రారంభించారు. ఎడ్ల బండిపై క్షేత్రంలో ఊరేగించిన పిడకలను యజ్ఞ కుండంలో వేసి హోమాన్ని నిర్వహించారు. ఈ యాగం జూలై 3న జరిగే మహా పూర్ణాహుతితో ముగుస్తుందని, యావన్మంది భక్తులు ఈ యజ్ఞ క్రతువులో పాల్గొనాలని శర్మ కోరారు.

ప్రజారంజక పాలన జగన్‌కే సాధ్యం

- 'గడపగడపకు'లో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ తదితరులు

బుట్టాయగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని పాత రాజానగరం, కొత్తరాజానగరం గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజుతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ హాజరయ్యారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ పార్టీలకు, రాజకీయాలకు, ప్రాంతాలకు, కులాలకు, మతాలకు సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా సచివాలయాల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల అమలులో మన రాష్ట్రానికి దేశంలోనే గుర్తింపు వచ్చిందన్నారు. వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని కూడా సీఎం జగన్ ఆదుకుంటున్నారన్నారు. జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ గంజిమాల దేవి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్ కుంజా దుర్గమ్మ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కొవ్వాసి నారాయణ, తెల్లం సింహాచలం, కుంజా ప్రసాద్, ములగల నాగేశ్వరావు, రమణ, నాగు, రమణ కోటి, ఈ.దుర్గాప్రసాద్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి



కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన తపన ఫౌండేషన్

కొయ్యలగూడెం : ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. శనివారం తపన ఫౌండేషన్ ఆధ్వర్యాన బయ్యన్నగూడెంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్‌తో కలసి ప్రారంభించారు. ఫౌండేషన్ ద్వారా మూడు నెలల పాటు 60 మందికి ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తామని ఫౌండేషన్ వలంటీర్ ఆరేటి ఏసుబాబు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దు బాలనాగేశ్వరావు, నాయకులు పారేపల్లి రామారావు, మద్దు తేజ, బాలం నరేష్, కటిక రాధాకృష్ణ, పారేపల్లి నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ నిరసన



పాఠశాల సమీపంలో నిరసన తెలుపుతున్న బాధితులు

కామవరపుకోట : మండలంలోని తడికలపూడిలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం అప్పు తీసుకుని ఇవ్వటం లేదంటూ న్యాయం చేయాలని కోరుతూ కొందరు బాధితులు పాఠశాల సమీపంలో నిరసన తెలిపారు. పాఠశాల నిర్మాణ, అభివృద్ధి కోసం పాఠశాల యాజమాన్యం అప్పు తీసుకున్నారని, తిరిగి అడిగితే కాలయాపన చేస్తూ తమని ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు పేర్కొన్నారు. తమకు జరిగిన అన్యాయంపై వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలని పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన నాయకులు బెజ్జం చిరంజీవి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పొట్ల విజయకుమారి, అచ్యుత్ సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శి బలే సుబ్బారావు, వేల్పుల సుందరం, పిట్టా రాహుల్, బాధితులు నరేంద్రరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, లక్ష్మణ్, చంద్రశేఖర్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులకు ఆంజనేయస్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆలయాన్ని శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు చైర్‌పర్సన్ పద్మశ్రీకి స్వాగతం పలికారు. స్వామి వారి సన్నిధిలో అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ చైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులకు అందజేశారు. అనంతరం పరిపాలన భవనం వద్ద పద్మశ్రీ మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రి గా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని మద్ది అంజన్నను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కన్వీనర్ ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో కష్టపడిన పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పద్మశ్రీ నియామకమే అందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గుబ్బల సత్యవేణి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్మన్ వందనపు సాయి బాలపద్మ, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, ఇన్‌చార్జి ఎంపీడీవో చుక్కా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కిట్ల పంపిణీ తీరు పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్ రెడ్డి

కొయ్యలగూడెం : కన్నాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులందరి వద్ద జగనన్న విద్యా కానుక కిట్లు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఉన్నదీ లేనిది పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో జగనన్న కిట్లు అందించడంలో ఎంఈవో జె.సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుల పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో బుట్టాయిగూడెం ఎంఈఓ బాబురావు, ప్రధానోపాధ్యాయులు జీవీపీ క్రిస్టోఫర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మనగుంటలో విద్యాకానుక కిట్ల పంపిణీ

కొయ్యలగూడెం : యర్రంపేట పంచాయతీ తిమ్మనగుంట గ్రామంలో జగనన్న విద్యా కానుక కిట్లను శనివారం ఎంపీపీ గంజిమాల రామారావు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంపీపీ స్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా పుస్తకాలు, భోజనం ప్లేట్లు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, అగ్గిరాజు, రమణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని 27వ వార్డు సీతానగరంలోని ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథ/గా హాజరైన వార్డు కౌన్సిలర్ నేత్రు సుబ్బలక్ష్మి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నేత్రు గణేష్ యాదవ్, గోవింద్, ప్రసాద్, షేక్ రబ్బానీ పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలి



ఎమ్మెల్యే తలారికి పూల బొకేను అందిస్తున్న ఎంఈఓ

ద్వారకాతిరుమల : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమల మండల నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన పరసా వెంకట్రావు ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ జగన్మోహన్‌రావు, గెద్దం దేవానందరావు తదితరులున్నారు.

ఇద్దరి అరెస్ట్

జంగారెడ్డిగూడెం : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిని స్థానిక బార్‌అండ్ రెస్టారెంట్ వద్ద కొట్టి గాయపర్చిన నేరంపై శనివారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టణానికి చెందిన చిట్టిబోయిన లక్ష్మణరావు, తలారి భాస్కర్ దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. గతంలో ఇదే కేసులో ముగ్గురిని అరెస్టు చేయగా, ఈ కేసులో మరొకరిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

27న సదరం శిబిరం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : ఈ నెల 27వ తేదీన మండల పరిషత్ కార్యాలయం వద్ద వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కేఆర్‌ఎస్ కృష్ణప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. వికలాంగుల పరికరాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తారని చెప్పారు. అభ్యర్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, 2 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని చెప్పారు.

దేవస్థానం కల్యాణ మండపంలోనే లాండ్రీ పనులు

ద్వారకాతిరుమల : శ్రీవారి కొండపైన మాధవ కల్యాణ మండప సముదాయంలోని పద్మాలయా కల్యాణ మండపం లాండ్రీ షాపుగా మారింది. దేవస్థానం విద్యుత్‌ను వినియోగిస్తూ సత్రాల్లోని బెడ్ షీట్లను కల్యాణ మండపంలో ఇస్త్రీ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఈ బెడ్ షీట్లను సంబంధిత పారిశుద్ధ్య కాంట్రాక్టరు ఉతికించి, ఇస్త్రీ చేయించి దేవస్థానానికి అప్పగించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా కొందరు అధికారుల అండదండలతో సంబంధిత కాంట్రాక్టరు ఏకంగా కల్యాణ మండపంలోనే ఇస్త్రీ చేయిస్తున్నారు. ఈ వ్యవహారం తనిఖీల్లో భాగంగా శనివారం ఉదయం పద్మాలయ కల్యాణ మండపంలోకి వెళ్లిన అకామిడేషన్ సూపరింటెండెంట్ రమణరాజు కంట పడింది. దాంతో ఇస్త్రీ పనులను నిలుపుదల చేయించి, సంబధిత విభాగ అధికారులకు సమాచారం అందించారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. అధ్యక్షురాలిగా డి.అమృతవల్లి, కార్యదర్శిగా చిలుకూరి రాజేశ్వరి, కోశాధికారిగా చిలుకూరి సోమి కాంతమ్మలచే పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పీఎంజేఎఫ్ కేవీ కిషోర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గ్లోబల్ లీడర్‌షిప్ కోఆర్డినేటర్ వెల్లంకి సత్య స్వరూప్, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ గోలి చంద్రశేఖర్‌రెడ్డి, డెసిగ్నెట్ ఆర్‌సీ ఎర్రంరాజు, జెడ్‌సీ సత్యవతి, డిజిగ్నేట్ జెడ్‌సీ రత్నకుమారి, డీసీలు చిల్లపల్లి రామ్మోహన్‌రావు, చుండూరి అబ్బయ్య, ఎ.పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు సత్కారం



విద్యార్థికి ప్రశంసా పత్రం అందచేస్తున్న దృశ్యం

చింతలపూడి : ప్రగడవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.సంజీవకుమార్ అధ్యక్షతన శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను సత్కరించి నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కోట్లాది రూపాయలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని తెలిపారు. జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా.రాంబాబు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. సర్పంచ్ టి.భూపతి, ఎస్‌ఎంసీ చైర్మన్ రవి, ఎంపీటీసీ విద్యా సాగర్, చండీప్రియ, ఎంఈఓలు జి.రామారావు, కిరణ్ బాబు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం

- మెట్ట ప్రాంతంలో వ్యవసాయ పనులు ప్రారంభం
- సబ్ డివిజన్‌లో 35,542 ఎకరాల్లో లక్ష్యం



చింతలపూడి ప్రాంతంలో ఖరీఫ్ దుక్కులు దున్నుకుంటున్న రైతులు

చింతలపూడి : మెట్ట ప్రాంతంలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలతో వ్యవసాయం పండగలా మారిందని రైతులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సన్న, చిన్న కారు రైతుల పెట్టు బడులకోసం ప్రభుత్వం రైతు భరోసా పథకంలో ఇటీవల రైతుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమచేయడంతో విత్తనాల కోసం అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. గత రెండు రోజులుగా తొలకరి పలకరించి వర్షాలు కురవడం ప్రారంభమవడంతో మెట్ట రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి నరసాపురం మండలాల్లో వరి పంటను సాగు చేసుకోవడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ బోర్ల కింద కొన్ని చోట్ల నారుమళ్ళు పోసుకున్నారు. మరికొన్ని చోట్ల నారుమళ్ళు పోయడానికి రైతులు విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. సబ్‌డివిజన్ పరిధిలో 35,542 ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 16,200 ఎకరాలు, లింగపాలెం మండలంలో 7,300 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 4,842 ఎకరాలు, టి నరసాపురం మండలంలో 7,200 ఎకరాలు సాగు చేస్తారు. ఇవి కాక 340 ఎకరాల్లో మొక్కజొన్న, 157 ఎకరాల్లో వేరుశనగ పంటలు పండిస్తారు.

విత్తనాలకు కొరత లేదు



సబ్‌డివిజన్ పరిధిలో విత్తనాల కొరత లేదు. రైతులు భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి సూక్ష్మ పోషక లోపాలను అధగమిస్తూ ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. వ్యవసాయశాఖ ద్వారా రైతుల కోసం వరి విత్తనాలను సిద్ధంగా ఉంచాం. అంతేకాక జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు రాయితీపై రైతులకు అందించాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన అన్ని రకాల సహకారాలు అందిస్తున్నాం.

– బి.నాగకుమార్, ఏడీఏ, వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్